# 72. పేరు లిపేరు

రాజమండ్రిలో ఏదో పని తగిల్తేను: నాకు తెలిసున్న ఒక హోటల్‌కి ఫోన్ చేసేను; ఒక గది నాపేరు మీద రిజర్వేషన్ చేసుంచమని చెబుదామని. సరిగ్గా ఆ వేళకి అక్కడ ఉన్నట్టున్నాడు నా అలనాటి క్లాస్ మేటూ ఒకనాటి సహాధ్యాయీ అయిన బలరామస్వామి; అతను మాట్లాడేడు. "నేనిక్కడున్నానని తెలీదా; లేక తెలిసే హోటల్లో దిగడానికి నిర్ణయించుకున్నావా?" అని ఏవో చివాట్లు పెట్టి, నేను రాజమండ్రిలో ఉండతల్చుకున్న మూడు రోజులూ తన ఇంట్లోనే ఉండడం తినడం అని నిర్ణయించేడు.

తీరా నేను అతనింటికి వెళ్ళేటప్పటికి 'స్వామి' ఇంటినిండా జనమే. అతని కూతురు ఇద్దరు పిల్లలతో వచ్చి వుంది. వియ్యంకుడు (అంటే కొడుకు మామగారు) వచ్చి ఉన్నాడు. "మా కోడలు ప్రసవించింది. కవల పిల్లలు! ఒక మగపిల్లాడూ ఒకాడపిల్లా కలిగేరు. ఎల్లుండి బారసాల" అన్నాడు బలరామస్వామి. శుభాకాంక్షలూ అభినందనలూ అయ్యేక "మరి నేను శాంతినివాస్‌కి వెళిపోతాను. కమలాకరరావుగారికి చెప్పేను కదా" అన్నాను. "అలా ఎంత మాత్రం కుదరదు. నీ అడ్డు మాకేమీ లేదు. పైగా శుభ సమయానికి నీలాంటి మిత్రుడు రావడం మాకెంతో ఆనందం. నీదేముంది? ఉదయం లేచి స్నానం పానం కానిచ్చి వెళ్తావు, సాయంకాలం పొద్దుపోయేక వస్తావు. మధ్యాహ్నం భోజనానికి ఎలాగా రాలేవు గనక రాత్రివేళ నాలుగు చుక్కా రొట్టెలు తిని ఇంత మజ్జిగ తాగి పడుకుంటావు!" అంటూ నేను ఎన్ని గంటలకి వెళ్ళిపోవాలి, ఎన్ని గంటలకి రావాలి. ఏమిటి తినాలి- అనేది నిర్ణయించి పారేశాడు స్వామి.

ఆ సాయంకాలం నేను స్వామి ఇంటికి వెళ్ళేసరికి అతనూ వియ్యంకుడూ ముందు హాల్లో కూర్చుని ఉన్నారు. నేలమీద ఎన్నో చిన్న చిన్న కాగితాలు చింపేసీ నలిపేసీ ఉండలు చుట్టీ పడివున్నాయి. నేను కూర్చుండే కుర్చీలో కూడా ఒక స్లిప్పు ఉంటేనూ, అది తీసి చదవగా నాకు అర్థమైపోయింది; వాళ్ళిద్దరూ దేన్ని గురించి వర్రీ అవుతున్నదీనూ. ఎల్లుండి స్వామి మనవడికీ మనవరాలికీ బారసాలా నామకరణ మహోత్సవమున్నూ. పిల్లలకి ఏం పేర్లు పెట్టాలీ అన్నది వాళ్ళ సమస్య.

"వంశోద్ధారకుడు మనవడు పుట్టేడు. వాడికి నీ పేరే పెట్టడం ఆనవాయితీ సమంజసం అవుతుంది. ఇహ మనవరాలికంటావా; మీ వియ్యపురాలి పేరు పెట్టేస్తే సరి. అన్నా చెల్లెళ్ళిద్దరికీ అన్నా చెల్లెళ్ల పేర్లు పెట్టినట్టూ అవుతుంది; రెండు కుటుంబాల నుంచీ రెండు పేర్లు పెట్టినట్టూ అవుతుంది" అని నేను ఉచిత సలహా పారేశాను.

అలా కుదరదుట. బలరామస్వామీ అతని వియ్యంకుడూ నాకు బోధపరిచేరు. పిల్లల పేర్లు మోడరన్‌గా ఉండాలని, కనీసం అపురూపంగా ఉండాలని కొడుకూ కోడలూ భావిస్తారేమో అని స్వామి అన్నాడు. పేర్లు సెలక్టు చేసేపని వీళ్ళిద్దరికీ అప్పగించి బలరామస్వామి కొడుకు వేరే పనుల మీద బిజీ అయిపోయాడట.

వియ్యంకుడు గారు తన చేతుల్లో ఇంతసేపూ ఉంచుకున్న పుస్తకం ఒకటి నాకు అందించేడు. "ఈ సమస్యపరిష్కరించుకోడానికి పనికొస్తుందని ఇందాక బజారు కెళ్ళినప్పుడు కొనుక్కొచ్చేను.

మీరు కూడా చూడండి.'' అన్నాడు.

"మీ ఇంట్లో ఒక బాబో పాపాయో పుట్టారా? ఏ పేరు పెడితే బావుంటుందని మీరు ఇదవుతున్నారా? ఐతే ఈ పుస్తకం మీ సమస్యని పరిష్కరిస్తుంది!'' అని ఆ పుస్తకం వెనక అట్టమీద ప్రింటు చేసి ఉంది. వెల పదహారు రూపాయలుమాత్రమే.

అందులో కొన్ని వేల పేర్లు (ఆడా, మగా) ఉన్నాయి.

కొన్ని పేజీలు తిరగేశాను. అబ్బో ! ఎంత పరిశ్రమ చేసేరు, ఈ బుక్కు రాసినవారు! అని ఆశ్చర్యపడ్డాను.

కులాల వారీగా, మతాలవారీగా ఎరేంజిమెంటు చేసున్నాయి పేర్లు. కులమూ మతమూ తెలియకుండా జాతీయ సమైక్యతకి చిహ్నంగా పెట్టుకోవాలంటే ఎలాగ అని ఒక చాప్టరు వుంది. సీతారామయ్య నుంచి కామేశ్వర సోమయాజులు వరకూ ఉన్నాయి. రమేష్ , దినేష్ ,సురేష్ , ప్రకాష్, అశోక్, లాంటి హలంత నామధేయాలున్నాయి. ఇహ ఆడపిల్లల పేర్లు అనూష, శిరీష, జిగీష, ఉష లాంటివి మొదలుకొని కామేశ్వరి, రాజేశ్వరి, జోగేశ్వరి, ఈశ్వరి లాంటి (ఇకారాంత స్త్రీలింగ) పేర్లున్నాయి. రెండక్షరాల పేర్లు, మూడక్షరాల పేర్లు ద్విత్వ-సంయుక్త అక్షరాలు లేనివి, ఉన్నవి- రకరకాలుగా పట్టీకరణం చేసున్నాయి. అకారాదిగా ఎరేంజి చేసిన భాగం-ఇలా చెప్పిందే ఇంకో రకంగా చెప్తుతూ ఏర్పాటు చేసినవి ఉన్నాయి. ఆ పుస్తకం చూసేక అయ్యో, ఇద్దరు పిల్లలతో ఆపెయ్యమని ప్రభుత్వం ఒత్తిడి చేస్తోందే; ఈ పేర్లన్నీ ఇంత అందంగా ఉన్నందుకు ఒక్కొక్క కుటుంబంలో కనీసం పదిమందిని కనడానికి పర్మిషనిచ్చినా తనివితీరదే అనిపించింది.

"మోడరన్‌గా ఉండాలని దేశం అంతటా వేవ్ ఉంది. ఉత్తరాది వాళ్లు పెట్టుకునేవి-ముఖ్యంగా బెంగాలీ వాళ్లు పెట్టుకునే పేర్లు ఎంత బావుంటాయో! పైగా ఈ పిల్లలు పెద్దవాళ్లయ్యేక ఏ ఆలిండియా పోటీ పరీక్షల్లోనో గెల్చుకుని ఇంటర్వ్యూల వరకూ వచ్చేరనుకోండి. వెంకటశాస్త్రి, నరసమ్మ లాంటి పేర్లు చూస్తే ఉద్యోగం ఇవ్వాలనుకున్నవాడు కూడా ఇవ్వడు'' అన్నాడు వియ్యంకుడు గారు.

బలరామస్వామి తన జేబులోంచి ఒక లిస్టు తీసేడు. "ఈ పేర్లు చూడు''.

అహిపతి, చతురాననం, దీనావనరావు, వృషాకపి, పంచబాణరావు, మైథిలీపతి, గోపీవల్లభరావు, కమలనయనం, బాలశశాంక మౌళి, సరిత్పతి - ఇలా ఉన్నాయి మగ పేర్లు. మధువ్రత, మందాకిని, మిత్రవింద, వాగ్దేవి, ఆదర్శ-ఇలా ఉన్నాయి ఆడపేర్లు.

"బావున్నాయి. ఎవరయినా వింటే ఈ పేర్లు పెట్టిన వాడు గొప్ప సంస్కృత పండితుడు అయి వుంటాడని భ్రమో గౌరవమో కలుగుతుంది. ఇవన్నీ ఎక్కడివి నీకు? ఏదైనా సంస్కృత గ్రంథంలో దొరికాయా?'' అన్నాను.

"లేదు. ఇవన్నీ తెలుగు నేలమీద తెలుగు పాత్రల పేర్లే. అడిగావు కనక చెప్తున్నాను. బావగారు చెప్పే పేర్లులాగ ఇవి కూడా ఒక తెలుగు పుస్తకంలోవే.'' అన్నాడు బలరామస్వామి.

"అబ్బాయి వస్తున్నట్టున్నాడు. అతన్ని కూడా కూర్చోబెట్టి నిర్ణయిస్తే మంచిదేమో.'' అన్నాను.

అబ్బాయి వస్తూనే "నాన్నారూ; పిల్లల పేర్ల విషయంలో మేం ఒక అండర్‌స్టాండింగ్ (ఒప్పందాని) కొచ్చేం. బలరామ్, సుభద్ర అనే పెడదాం అనుకుంటున్నాం; మీ పేరూ మా అత్తగారి పేరూ. అంతే ఇంక మీరిద్దరూ బుర్రలు పాడుచేసుకోకండి.'' అన్నాడు.

"చూసేవా? నేనే గెల్చాను.'' అన్నాను. బలరామస్వామి ఇచ్చిన లిస్టు చింపిపారేస్తూ. ★